TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 74 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.08.10.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




## 86 లక్షల వాహనాలతో రాని కాలుష్యం 2,900 ఆర్టీసీ బస్సులతో వస్తుందా?



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'రాష్ట్రంలో కోటి 70 లక్షల వాహనాలు ఉన్నాయి. రాజధాని హైదరాబాద్‌లో 86 లక్షల వాహనాలు తిరుగుతున్నాయి. వాటిలో ఆర్టీసీ బస్సులు కేవలం 2,900. అన్ని లక్షల వాహనాల ద్వారా తలెత్తని కాలుష్యం, కేవలం ఆర్టీసీ బస్సుల వల్లే వస్తుందా? వ్యక్తిగత వాహనాల సంఖ్య తగ్గించి, ఆర్టీసీ వంటి ప్రజారవాణాను ప్రోత్సహిస్తేనే కదా పర్యావరణం పరిరక్షింపబడేది. ఇంత చిన్న లాజిక్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎలా మిస్ అయ్యింది' అని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది. ఇతర వాహనాలతో పోల్చిచూస్తే, ఆర్టీసీ బస్సుల వల్ల వెలువడే కర్బన ఉద్గారాలు చాలా తక్కువనీ, దీనికి భిన్నంగా ఆర్టీసీ వల్లే పర్యావరణం పాడవుతోందని ప్రచారం చేయడం సరికాదని సర్కారుకు సూచించింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన ఆఫీస్ బేరర్ల సమావేశం మంగళవారంనాడిక్కడి సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది.

ఆర్టీసీలోకి అద్దె ప్రాతిపదికన తెస్తున్న ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సుల్ని సమర్థించుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహా ప్రచారం చేస్తున్నదని ఆ సమావేశం అభిప్రాయపడిందని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి, వాటిని సమకూర్చుకొనే అవకాశం ఆర్టీసీలకు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న అన్ని విద్యుత్ బస్సుల పథకాలు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) పద్ధతిలో ప్రయివేటు సంస్థలకు సబ్సిడీలు ఇచ్చి, ఆర్టీసీలు నేరుగా వాటిని పొందేందుకు అనుమతించట్లేదనే విషయాన్ని ఆఫీస్ బేరర్ల సమావేశం ప్రస్తావించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం విధానాలనే అమల్లోకి తేవడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆర్టీసీలే విద్యుత్ బస్సుల కొనుగోలు, మెయింటెనెన్స్, ఆపరేషన్ చేసేలా విధానాల్లో మార్పులు చేయాలని, ఆదాయానికి, ఖర్చుకు మధ్య వస్తున్న వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'వయబిలిటీ గ్యాప్ ఫండ్'గా ఆర్టీసీకి చెల్లించాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాల్సినదేనని స్పష్టంచేశారు.

పర్యావరణ పరిరక్షణ వ్యక్తిగత వాహనాలను తగ్గించి, ప్రజా రవాణా బస్సుల్ని విస్తరించడం వల్లే సాధ్యమవుతుందనీ, ట్రాఫిక్ రద్దీకూడా నియంత్రణలోకి వస్తుందని సూచించారు. కానీ పాలకులు దీనికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. దాదాపు హైదరాబాద్‌లో ఉన్న జనాభా, విస్తీర్ణంలోనే బెంగుళూరు సిటీ కూడా ఉందనీ, అక్కడ 6,500 బస్సులు తిరుగుతుంటే, హైదరాబాద్‌లో కేవలం 2,900 మాత్రమే ఉన్నాయని విశ్లేషించారు. దీనివల్లే సిటీలో ప్రజలు వ్యక్తిగత వాహనాలు, ప్రయివేటు రవాణాలోకి బలవంతంగా నెట్టివేయబడుతున్నారనే విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక వనరులన్నీ ఆర్టీసీ సమకూరిస్తే, వాటిని వినియోగించుకొని ప్రయివేటు సంస్థలు లాభాలు సంపాదిస్తాయని తెలిపారు. మౌలిక వనరుల కల్పన కోసం నిధులు సమీకరణ పేరుతో టిక్కెట్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం సరికాదని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ అభిప్రాయపడింది.

హైదరాబాద్ నగరంలోకి మూడేండ్లలో వచ్చే 2,800 ప్రయివేటు విద్యుత్ బస్సులన్నీ 'గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్' పద్ధతిలో ఆర్టీసీలోకి వచ్చేవేననీ, దీనివల్ల ఇప్పుడు సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికులు 'మిగులు'గా తేల్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పైన సూచించినట్టు విధాన నిర్ణయాల్లో మార్పులు చేయాలని కోరారు. విద్యుత్ బస్సుల విధానంలో మార్పుల కోసం ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) నాయకత్వంలో దేశవ్యాపితంగా ఆందోళనలు జరుగుతున్నాయనీ, దానిలో భాగంగానే నవంబర్ 23న చెన్నైలో దేశవ్యాప్త సదస్సుని నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు రూపకల్పన జరుగుతుందని వివరించారు.

# కొమురం భీం స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శం




కెరమెరి :అమృత్ తెలంగాణ: జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కొమురం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు..ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. కుమురం భీం – ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసుల ఆరాధ్య దైవం కుమురం భీం 85వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ భీం విగ్రహానికి నివాళులర్పించారు. సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఆదివాసుల ఆశాజ్యోతి కొమురం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, బానిసత్వపు సంకెళ్లు తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. స్వయంపాలన ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కొమురం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని తెలిపారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల సాధన కోసం గోండు వీరుడు కుమురం భీం తన జీవితాంతం పోరాడారని అన్నారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆడబిడ్డలు, గిరిజనుల హక్కుల కోసం పోరాడి దేశానికే గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. గిరిజనుల ఆత్మగౌరవ ఉద్యమాలకు మార్గదర్శకుడని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, కోవలక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు,

ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్, కొమురం భీం మనువడు సోనేరావు, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ క్రాంతిలాల్ పాటిల్, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పొన్నం 'నోటి దురుసు'.. కాంగ్రెస్‌లో 'దుమారం'!

కరీంనగర్ : అమృత్ తెలంగాణ: సహచర మంత్రిపై నోరు జారిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త తలనొప్పి తెచ్చిపెట్టారు. సమావేశానికి సమయానికి రాలేదన్న అసహనంతో దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఉద్దేశించి 'ఆ దున్నపోతుగానికేం తెలుసు' అంటూ బాడీ షేమింగ్‌పై చేసిన వ్యాఖ్యల వీడియో పుటేజీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యాఖ్యలు మైక్‌లో రికార్డయి బయటకు రావడంతో వివాదం ఒక్కసారిగా భగ్గుమంది. ఇది కేవలం ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలకు దారితీసినా.. 'మాదిగల ఆత్మగౌరవం' చుట్టూ తిరుగుతూ కులం రంగు పులుముకుంది. మంత్రి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, దళిత సంఘాలు క్షమాపణకు అల్టిమేటం జారీ చేయడంతో ఈ ఎపిసోడ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత సంక్షోభానికి దారితీసింది. పొరపాటును అంగీకరించకుండా 'ఇది బీఆర్‌ఎస్ కుట్ర' అంటూ పొన్నం చెప్పడాన్ని మంత్రి అడ్లూరి, ఆయన అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది పొన్నం అహంకార వైఖరికి నిదర్శనమనే అభిప్రాయం ఆ పార్టీలో వినిపిస్తోంది.

అసలేం జరిగింది?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహ్మత్ నగర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే, మంత్రి లక్ష్మణ్ కాస్త ఆలస్యంగా రావడంతో పొన్నం ప్రభాకర్ అసహనానికి గురయ్యారు. పక్కనే ఉన్న మంత్రి వివేక్ చెవిలో 'మనకు టైం అంటే తెలుసు.. జీవితమంటే తెలుసు.. వారికేం తెలుసు.. ఆ.. దున్నపోతు గానికి' అని గుసగుసలాడారు. మైకులు ఆన్‌లో ఉండటంతో ఈ వ్యాఖ్యలు స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. సహచర మంత్రిని, అందులోనూ ఒక దళిత మంత్రిని ఉద్దేశించి బాడీ షేమింగ్ చేయడంపై




సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇది కేవలం లక్ష్మణ్‌కు జరిగిన అవమానం కాదని, మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఎమ్మార్పీఎస్ వంటి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

క్షమాపణకు ససేమిరా.. బీఆర్‌ఎస్ కుట్రంటూ ఎదురుదాడి

వివాదం ముదురుతున్నా మంత్రి పొన్నం ప్రభాకర్ తీరులో మార్పు రాలేదు. తప్పును అంగీకరించి క్షమాపణ కోరాల్సింది పోయి, ఎదురుదాడికి దిగారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, ఇదంతా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. 'అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పీసీసీ అధ్యక్షులు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్' అని చెప్పడం ద్వారా ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని చూశారు. అయితే, ఆయన వైఖరి.. సమస్యను మరింత జఠిలం చేసింది. కనీసం పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయకపోవడం పొన్నం అహంకారానికి నిదర్శనమని, ఆయనలోని దురుసుతనాన్ని ఇది బయటపెట్టిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదే సమయంలో ఈ వివాదాన్ని త్వరగా పరిష్కరించకపోతే, అది ప్రభుత్వ ప్రతిష్టకు తీవ్ర భంగం కలిగించడంతో పాటు పార్టీలోని సామాజిక తరగతుల మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉందని పార్టీ సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా : అడ్లూరి

పొన్నం వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. 'జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవం ఉంటుంది. మాదిగలు అంటే అంత చిన్న చూపా?' అని ఆయన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నం తన తప్పు తెలుసుకుంటాడని ఆశించానని, కానీ ఆయన మారకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా, 'నేను మాదిగను కాబట్టే నాకు మంత్రి పదవి వచ్చింది. నేను మంత్రి కావడం, మా సామాజిక తరగతిలో పుట్టడం తప్పా?' అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. మంత్రి వివేక్ తన పక్కన కూర్చోవడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇది ఎంతవరకు సమంజసమని ఆయన వాపోయారు.

సర్దుబాటుకు అధిష్టానం యత్నం

ఈ వివాదం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విబేధాలను మరోసారి బయటపెట్టింది. సొంత పార్టీ నేతలే పొన్నం వైఖరిని తప్పుబడుతున్నారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు సైతం లక్ష్మణ్‌కు మద్దతుగా నిలిచి, పొన్నం తీరును తప్పుబట్టాయి. బుగ్గారం మండల కాంగ్రెస్ నాయకులు పొన్నం వ్యాఖ్యలను ఖండించారు. మరో మంత్రి శ్రీధర్‌బాబు కూడా పొన్నం వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. దాంతో రంగంలోకి దిగిన టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ ఇద్దరు మంత్రులతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిచే ప్రయత్నం చేశారు. మరోవైపు 24 గంటల్లో పొన్నం క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ హెచ్చరించింది.

## దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుంది: కేటీఆర్



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించటాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుందన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు అని చెప్పారు. ఇది వ్యక్తిపై దాడి కాదని, వ్యవస్థపైనే దాడి అంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

'మన దేశంలో అసహనం అత్యున్నత స్థాయికి చేరుకుంది. దీనికి నిన్న సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి జరగడం ఒక దారుణమైన సంకేతం. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని తీవ్రంగా, నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నా. న్యాయవ్యవస్థ గౌరవంపై జరిగిన ఈ సిగ్గుచేటైన దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు, ఆ వ్యవస్థపైనే జరిగిన దాడి. విశ్వాసం వంటి సున్నితమైన అంశాలపై ఎలాంటి విభేదం ఉన్నా కూడా హింసను సమర్థించదు. ఇటువంటి దాడులు ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు కలిగిస్తుంది' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఐటీ సోదాలు..




హైదరాబాద్: అమృత్ తెలంగాణ: మరోసారి తెలుగు రాష్ట్రాల్లో ఏక కాలంలో ఐటీ అధికారులు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, తెలంగాణలోని మహబూబ్ నగర్ ప్రాంతంలో మొత్తం పది చోట్ల పప్పు దినుసుల హోల్‌సేల్ వ్యాపారుల నివాసాల్లో రెయిడ్స్ నిర్వహిస్తున్నారు. వారు చేస్తున్న వ్యాపారానికి రికార్డులలో చూపించే లెక్కలకు ఏమాత్రం పొంతన కుదరకపోడాన్ని గమనించి ఐటీ అధికారులు ఈ మెరుపు సోదాలకు దిగినట్లుగా సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

## జూబ్లీహిల్స్ టీడీపీ అభ్యర్థిగా నందమూరి సుహాసిని ?



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ రాజకీయాల్లో సత్తా చాటాలని టీడీపీ తెలంగాణ శాఖ భావిస్తున్నది. ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం ఎన్.చంద్రబాబునాయుడు పావులు కదుపుతున్నారని ప్రచారంలో ఉంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నేతల మధ్య చర్చోపచర్చలు చోటుచేసుకుంటున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థిగా నందమూరి హరికృష్ణ కూతురు, సినిమా నటుడు జూనియర్ ఎన్టీఆర్ సోదరి సుహాసినిని ఎన్నికల బరిలోకి దించాలని టీడీపీ భావిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే తెలంగాణ పార్టీలో సుహాసిని పేరు ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. ఇక పార్టీ అధినేత గ్రీన్‌సిగల్ ఇవ్వడం లాంఛనమేనని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయి. సుహాసిని గతంలో కూకట్‌పల్లి నుంచి పోటీచేసినా, విజయం సాధించలేకపోయారు. ఈసారి మూడు పార్టీలు మద్దతిస్తే గెలుపు సులువవుతుందని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయంపై బీజేపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్టు సమాచారం. టీడీపీ పొత్తు వద్దని తెలంగాణ బీజేపీ నేత ఒకరు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు లేఖ రాసినట్టు సమాచారం. తెలంగాణ సీఎం రేవంత్‌కు చంద్రబాబు ఈ ఎన్నికల్లో పరోక్ష మద్దతిచ్చే అవకాశాలు ఉండటంతో తెలంగాణలో బీజేపీకి నష్టం చేస్తుదంటూ లేఖలో పేర్కొన్నట్టు సమాచారం. తెలంగాణ పార్టీ నాయకులు సైతం ఈ టికెట్ ఆశిస్తున్నట్టు తెలిసింది. అయితే చంద్రబాబు నిర్ణయం చేస్తే, దానికి కట్టుబడి ఉండే అవకాశాలు ఉన్నాయని టీడీపీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పేర కాంగ్రెస్‌కు సహకరించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నవారూ లేకపోలేదు. చంద్రబాబు తెలంగాణ నేతలతో చర్చించనున్నారు. అనంతరమే బీజేపీ జాతీయ నాయకులతో మాట్లాడతారని సమాచారం. ఇక్కడ గెలవకున్నా, బీఆర్‌ఎస్ ఓట్లను చీల్చి కాంగ్రెస్‌కు పరోక్షంగా సహకరిస్తారనే వ్యాఖ్యానాలు రాజకీయవర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

# భూ భారతి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి "భూ భారతి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను ఈ నెల చివరి వారంలోగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసిల్దార్ లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అనలు చేస్తున్న భూ భారతి కార్యక్రమం ద్వారా రైతులు, దరఖాస్తుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా , దరఖాస్తుల పరిశీలన లో అలసత్వం వహించకుండా వేగంగా ముందుకు సాగాలని, ఆయా మాడ్యూల్ లో వచ్చిన దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఎన్ని పరిష్కారం, ఎన్ని పెండింగ్, నోటీసులు ఇచ్చిన వాటి క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ, తదితర వాటిపై ఆరా తీసి గడువులోగా పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు ఆయా తహసీల్దార్ల వద్ద పెండింగ్ ఉన్న వివరాల తీరును ఆరాతీసి వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సాదాబైనామా, పి ఓ టీ లకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన ప్రక్రియ జరపాలని, వెంట వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలని, రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ వేగవంతంగా పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు భూ భారతి కింద వచ్చిన దరఖాస్తుల పురోగతి పై సమీక్షించి నోటీసులు జనరేట్ చేసి సర్వే చేసిన వివరాలను అడిగి తెలుసుకొని ఈ ప్రక్రియ ను రెండు టీములుగా ఏర్పాటు చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రాజేశ్వర్, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు. పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి – కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రామాయణాన్ని రచించిన మహానుభావుడు వాల్మీకి మహర్షి అన్నారు. వాల్మీకి రచనల్లోని విలువలను అందరూ పాటించాలని పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకలలో ఆర్డీవో రత్నకళ్యాణి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, మత్స్యశాఖ ఏడి రాజానర్సయ్య, పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందివ్వాలని టీజీ. ఎన్.పి.డి.సి.ఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.






సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో టీజీ. ఎన్.పి.డి.సి.ఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులతో, ఆ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో విద్యుత్ వినియోగం పై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కొత్త విద్యుత్ ఉపకేంద్రాలు, విద్యుత్ లైన్లు అవసరముంటే వెంటనే తమకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అటవీ ప్రాంతాల్లో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణం, విద్యుత్ స్థంబాల స్థాపన, తదితర నిర్మాణాల విషయంలో అటవీ అనుమతులు వీలైనంత త్వరగా పొందాలన్నారు. అటవీ అధికారులతో సమన్వయ పరుచుకోవాలని సూచించారు. నిర్మాణాలకు సంబంధించి వ్యయ అంచనాలు సిద్ధం చేసి నివేదికలు పంపాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ వేగవంతంగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేపట్టాలన్నారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని, రైతాంగానికి, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేలా ఇప్పటి నుంచే ప్రాణాలకలు సిద్ధం చేసుకోవాలన్నారు. పంట కోతలు పూర్తవ్వగానే అవసరమైన చోట పంట పొలాల్లో నూతన విద్యుత్ లైన్లు, మరమత్తులు చేపట్టాలన్నారు. ప్రజలకు, రైతాంగానికి అనవసర కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ మరమ్మత్తులు, విధులు నిర్వహించే సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించాలని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో అమలు చేస్తున్న బాలశక్తి కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటి దశలో భాగంగా జిల్లాలోని కేజీబీవీలలో విజయవంతంగా బాలశక్తి కార్యక్రమాన్ని అమలుపరిచామని అన్నారు. అదేవిధంగా జెడ్పీ పాఠశాలల్లో రెండో దశలో భాగంగా బాలశక్తి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు పూర్తి చేసిన వైద్య పరీక్షల వివరాలు మండలాల వారిగ సమీక్షించారు. విద్యార్థులందరికీ రక్తహీనత, థైరాయిడ్, పోషక లోపాల గుర్తింపు, తదితర వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో లోపాలు గుర్తిస్తే, వారికి ప్రత్యేక పోషక ఆహారంతో పాటుగా అవసరమగు మందులను అందివ్వాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, వారి ఆరోగ్య స్థితిగతుల్లో మార్పు వస్తుందో, లేదో చూడాలన్నారు. అన్ని వివరాలు వారి హెల్త్ కార్డుల్లో నమోదు చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించినప్పుడు వారి ఆరోగ్య విషయాలు పోషకులకు వివరించాలన్నారు. ఒత్తిడిని అధిగమించుట, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మానసిక ఆరోగ్యం, తదితర అంశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బ్యాంకు అధికారులు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

స్వయంగా బ్యాంకులకు విద్యార్థులను తీసుకువెళ్లి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అన్ని వివరాలు తెలిసేలాగా ప్రభుత్వ కార్యాలయాలకు, వైజ్ఞానిక యాత్రలకు తీసుకెళ్లాలని తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ భోజన్న, డిఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ రాజేందర్, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి: డీఈఓ



చారకొండ :అమృత్ తెలంగాణ: మండలంలోని జూపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న తరగతి గదులను, పాఠశాల పరిసరాలు, వంట గదులను తనిఖీ చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం ను కూడా పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేలా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే తరగతి గదిలో విద్యార్థులకు గణిత సబ్జెక్టులపై బోధన చేసి విద్యార్థులకు గణితంలో మేలుకోలను నేర్పించారు. గణితంపై ఆసక్తిని పెంచేలా ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా బోధనా పద్ధతులు చేపట్టాలని సూచించారు. డీఈవో తోపాటు జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు ఉన్నారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పై మంత్రి పొన్నం వాఖ్యలను ఖండించాలి




అచ్చంపేట :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ శాఖ మంత్రి లక్ష్మణ్ పై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన వాక్యాలను ప్రతి ఒక్కరు ఖండించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుక్కాపురం మహేష్ అన్నారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేటలో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మహేష్ మాట్లాడారు. ఒకరిని హేళన గా మాట్లాడేముందు నువ్వు ఎలా ఉన్నవో చూసుకొని మాట్లాడాలని అన్నారు. ప్రజాసేవలో నిష్టతో ఉన్న దళిత మంత్రి పై ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయ సంస్కృతికి తగనిది అన్నారు. ఆయన దళిత మంత్రిగా ఉన్నందునే ఉద్దేశపూర్వకంగా అవమానించారని పేర్కొన్నారు. ఇది కేవలం వ్యక్తిగత దూషణ కాదు, దళిత వర్గాల, మాదిగ సమాజం ఆత్మగౌరవంపై నేరుగా దాడి అని తీవ్రంగా విమర్శించారు.

పొన్నం ప్రభాకర్ వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగంగా మంత్రి లక్ష్మణ్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ప్రజాస్వామ్య ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకులు ప్రజాస్వామ్య మర్యాదలు పాటించాలి. దళిత మంత్రులను, మాదిగ వర్గ నాయకులను అవమానించే విదంగా మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతే తీవ్ర పరిణామాలు ఉంటాయి అని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల భారత్,రమేష్ ,రాజు,సంపత్,మాదిగ విద్యార్థినిలు ఐశ్వర్య, నందిని శృతి, తదితరులు ఉన్నారు.

# మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ (TNGOs) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.




నిర్మల్ జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీఎన్జీవో అధ్యక్షులు ప్రభాకర్ మరియు సభ్యులు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ (TNGOs) సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సభ్యులందరికీ దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరూ సమన్వయంతో, నిబద్ధతతో పని చేసి ప్రజా సేవలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో TNGOs జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



అచ్చంపేట :అమృత్ తెలంగాణ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం డివిజన్ నాయకులు తిరుపతయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి బోయలు రాజకీయ, ఆర్థిక రంగాలలో అభివృద్ధిని సాధించేందుకు ఐక్యంగా ముందుకెళ్లాలన్నారు. వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ ను అమలు చేసుకునేందుకు చైతన్యమై పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు తిరుపతయ్య, శ్రీనివాసులు, బాలయ్య, పాండు, లక్ష్మీనారాయణ, రామనాథం, ఖాజా, శంకర్, మల్లేష్, శాంత కుమార్, పర్వతాలు, మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సీజేఐపై దాడి.. అంబేద్కర్ యువజన సంఘం నిరసన

బల్మూరు :,అమృత్ తెలంగాణ: దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజేఐ) పై దాడికి నిరసనగా మండల కేంద్రం బల్మూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు అధ్యక్షులు మాట్లాడుతూ.. భారత న్యాయ వ్యవస్థ పట్ల గౌరవం లేని విధంగా వ్యవహరించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పట్ల అనుచితంగా వ్యవహరించి అవమానించడాన్ని అంబేద్కర్ యువజన సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. భారత రాజ్యాంగాన్ని న్యాయ వ్యవస్థను అవమానపరిచిన న్యాయవాదిని వెంటనే విధుల నుండి తొలగించి చట్టపరమైన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బిజెపి పాలనలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్న స్పందించడం లేదని అందుకే ఇలాంటి ఎన్నో సంఘటనలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. దేశంలో సనాతనం అని పురాతనం అని బిజెపి పదేపదే ప్రజలను మభ్యపెడుతుండడం వల్లనే ఇలాంటి చాందస భావాలు పెరిగిపోతున్నాయని.. న్యాయ వ్యవస్థను రాజ్యాంగాన్ని గౌరవించలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే భవిష్యత్తులో దళిత సంఘాలు అంబేద్కర్ యువజన సంఘాలు మరియు ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్ట నున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు చంద్రమౌళి సంఘం సభ్యులు గణేష్ కుమార్, గంగాధర్, శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు తగిలి శ్రీనివాసులు, తిరుపతయ్య, చాంద్ పాషా, వెంకటయ్య ఉన్నారు.

# డ్రైనేజీ లను జె సి బి లతో శుభ్రం చేయించిన మున్సిపల్ కమిషనర్.





అమృత్ తెలంగాణ మెట్ పల్లి అక్టోబర్ 07: మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ భారీ వర్షం కురుస్తున్నందున పలు వార్డులలో పర్యటించి జెసిబి ద్వారా మురికి కాలువలు క్లీన్ చేయించడం జరుగుతుంది. కమిషనర్ మాట్లాడుతూ వార్డులలో మెయిన్ డ్రైనేజ్ వర్షపు నీరు ఎక్కడ ఆగకుండా జెసిబి ద్వారా తీయించడం జరుగుతుందని వార్డులలో వర్షానికి విపరీతంగా మురికి కాల్వల వెంబడ గడ్డి పిచ్చి మొక్కలు పెరిగి పోవడం వలన పారిశుధ్య సిబ్బందిచే మురికి కాలువలు తీయించడం జరుగుతుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు,ముజీబ్,నరేష్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : అడిషనల్ కలెక్టర్ : బి రాజా గౌడ్



జగిత్యాల అమృత్ తెలంగాణ అక్టోబర్ 07 మంగళవారం బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ కమిటీ యొక్క జిల్లా స్థాయి సమావేశం అడిషనల్ కలెక్టర్ బి రాజా గౌడ్ ఆధ్వర్యంలో ఆయన ఛాంబర్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ కచ్చితంగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంటు యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటించాలని వీటిని ఏదైనా యాజమాన్యం అతిక్రమించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని, ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పై తగిన శ్రద్ధ వహించాలని, వెంకటరమణ బయో మెడికల్ వేస్ట్ ఇన్సినరేషన్తో టైయాప్ కావాలని తెలిపారు. ఎవరు కూడా మున్సిపల్ కు సంబంధించిన వాహనాలలో బయో మెడికల్ వేస్ట్ చెత్తను పారవేయకూడదని అలా జరిగినచో వారిపై తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 302 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని కానీ వీటిలో కొన్ని ఆసుపత్రులు టైయప్ కాలేదని వారందరూ విధిగా టైయప్ చేయించుకోవాలని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని ఆర్ఎంపీ/ పీ ఎం పీ లందరూ ముఖ్యంగా మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి ఆర్.ఎం.పి,లు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడిని ఖండిస్తూ మెట్ పల్లి బార్ అసోసియేషన్ నిరసన.



నిరసన తెలుపుతున్న మెట్ పల్లి బార్ అసోసియేషన్

మెట్ పల్లి అమృత్ తెలంగాణ అక్టోబర్ 07 జగిత్యాల జిల్లా మెట్ పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన న్యాయవ్యవస్థను కించపరిస్తే సహించేది లేదని అన్నారు. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి, కోర్టు గేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశ పౌరులందరూ న్యాయవ్యవస్థను గౌరవించాలని వారు కోరారు. వ్యవస్థను కించపరిచేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కిసాన్ కాప్ బహిష్కరించిన రైతులు..

బజార్ హత్నూర్ : అమృత్ తెలంగాణ: మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో నిర్వహించిన కిసాన్ కాప్ అవగాహన సదస్సు ను మండల రైతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సీసీఐ రా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్ రైతుల పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. నిరక్షరాస్యులైన రైతుల వద్ద స్మార్ట్ఫోన్లు లేవని, మారుమూల గ్రామాలకు సిగ్నల్లు సైతం సరిగా రావడం లేదని వాపోయారు. స్లాట్ బుకింగ్ విధానంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని బజార్ హత్నూర్ వ్యవసాయ అధికారికి రైతులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# బి సి లకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే : కొమిరెడ్డి విజయ్ అజాద్.



అమృత్ తెలంగాణ మెట్ పల్లి అక్టోబర్ 07: తెలంగాణలో స్థానిక ఎన్నికల పోరు పై డైలమా నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఈనెల 8న బీసీ కోటాలో 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చే తీర్పుపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది.మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇదివరకే తెలంగాణలో స్థానిక ఎన్నికల నగారా మోగించి, ఎంపీటీసీ,జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో నువ్వా నేనా అన్న రీతిలో నెలకొన్న ప్రతిష్టంబన కు రేపు హైకోర్టు తీర్పుతో తెర పడనుంది. దీనిపై తాజాగా టీపీసీసీ సీనియర్ నాయకులు, హైకోర్టు న్యాయవాది కొమిరెడ్డి విజయ్ ఆజాద్ మంగళవారం IA.no.21/2025.in w.p.no.30217/2025 ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని సమర్థిస్తూ హైకోర్టులో మంగళవారం రిట్ ఫిషన్ దాఖలు చేసి, పైన పేర్కొన్న కేసుద్వారా ఇంప్లీడ్ కావడం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. పిటిషనర్ కొమిరెడ్డి విజయ్ ఆజాద్ తరపున హైకోర్టు ఆదేశించిన న్యాయవాది కొమిరెడ్డి కరంచంద్ గురువారం 8న తెలంగాణ హైకోర్టులో తమ వాదనలు వినిపించనున్నారు.

# సరిహద్దుల గుండా అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలి.

**ఎన్నికల సమయంలో గ్రామాలలో విపిఓ విధానం నిషితంగా అమలు చేయాలి.**
**పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలి**
**అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్లిసాయంత్రం సమయంలో వాహనాల తనిఖీ, ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా తనిఖీలు చేపట్టాలి**
**క్రమం తప్పకుండా రౌడీ షీటర్లను, హిస్టరీ షీటర్లను తనిఖీ చేయాలి.**
**మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి**
**గంజాయి మాదకద్రవ్యాల రవాణా పండించడం పూర్తిగా రూపుమాపలి.**
**పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి.**
**తాంసి పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ.**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.**







ఆదిలాబాద్ జిల్లా, అక్టోబర్ 7 :-ఎన్నికల సమీపిస్తున్న వేళ మండలాలలో గ్రామ స్థాయిలో ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకొని ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా తగిన కార్యచరణను రూపొందించి, అవలంబించారని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. ఈరోజు సాయంత్రం తాంసి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతతో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడుతూ రానున్నది ఎన్నికల సమయం పూర్తి సంసిద్ధంగా ఉండాలని, గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, గ్రామాలలో జరుగు ఆసాంఘిక కార్యకలాపాల పట్ల, సామాజిక కార్యకలాపాల పట్ల పూర్తి సమాచారం రాబట్టేలా పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మాణం చేసుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ గ్రామాలలో ప్రజలకు గంజాయి మాదకద్రవ్యాలు సైబర్ క్రైమ్ చైల్డ్ మ్యారేజ్ విమెన్ హరాస్మెంట్ లాంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపరచాలని సూచించారు. ముఖ్యంగా యువతకు చదువు కు ఉన్న ప్రాధాన్యతను తెలియజేసి ఉన్నత లక్ష్యాలను అభ్యసించేలా ప్రోత్సహించాలని తెలిపారు. సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే సిబ్బంది కేటాయించి బాధితులలో పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని సూచించారు. ప్రతిరోజు సాయంత్రం సమయంలో వాహనాల తనిఖీ చేస్తూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. విధులలో క్రమశిక్షణ సమయపాలన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ప్రతిరోజు రోల్ కాల్ మరియు ప్రతి శనివారం పోలీస్ పరేడ్ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన ప్రతి ఒక్క కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిందితులకు శిక్షలు పడేవిధంగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మండలం మహారాష్ట్రతో సరిహద్దుతో ఉన్నందున అక్రమంగా ఎన్నికలలో ప్రభావితం చేసే విధంగా డబ్బు మద్యం మరియు బహుమతులు రవాణా కాకుండా నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిదర్, తాంసి ఎస్ఐ ఎస్ జీవన్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి: కలెక్టర్



ఆలేరు :అమృత్ తెలంగాణ: మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలంటూ యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మంగళవారం ఆలేరు మండలం శారాజిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్,మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వకపోవడంతో సంబంధిత ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం ఉందా లేదా అన్నది స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. స్కూల్లో విద్యార్థుల సంఖ్య, పదవ తరగతి విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకున్నారు.

# ప్రజా పోరాటాలను ఉధృతం చేయడమే లతీఫ్ భాయ్ కి ఘనమైన నివాళి

యాదగిరిగుట్ట : అమృత్ తెలంగాణ: యస్ కె లతీఫ్ కమ్యూనిస్టు ఉద్యమంలో 40 సంవత్సరాలు నిరంతరం పనిచేశారని, ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎం డి జహంగీర్ అన్నారు. మంగళవారం, యాదగిరిగుట్ట పట్టణం, లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్, ఈ మధ్యకాలంలో గుండె పోటుతో మరణించిన సీపీఐ(ఎం) పట్టణ నాయకులు ఎస్ కె లతీఫ్ సంతాప సభ పట్టణ కార్యదర్శి నూకల భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు లతీఫ్ భాయ్ చిత్ర పటానికి పూల మాల వేసి జోహార్లు అర్పించారు.

ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో యండి జహంగీర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు లీడర్ ను తయారు చేయాలంటే 20 నుంచి 25 సంవత్సరాలు పడుతుంది, ఒక నాయకత్వ స్థాయికి వచ్చిన తర్వాత అతను కాస్తా దూరమైతే దాని ప్రభావం పార్టీ మీద, సమాజం మీద, కుటుంబం మీద ఉంటుంది అన్నారు. ఆయన లేని లోటును పూడ్చలేనిది అన్నారు. పట్టణంలో, మండలంలో, జిల్లా మైనారిటీ ఆర్గనైజేషన్ లో, వివిధ రంగాలలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్న నాయకుడు లతీఫ్ అని తెలియజేశారు. కమ్యూనిస్టులు వ్యవస్థను మార్చాలని లక్ష్యంతో పనిచేస్తారని అన్నారు. వ్యవస్థలో ఉన్నటువంటి శ్రామికుల్ని, పేదలను ప్రభుత్వాలు ఐక్యం కానివ్వడం లేదని వారిని ఐక్యం చేసే పని కమ్యూనిస్టులుగా చేస్తున్న పనిలో లతీఫ్ భాయ్ పాత్ర ఉందన్నారు. లతీఫ్ నాయకుడిగా ఉంటూ, సందర్భం వచ్చినప్పుడు కార్యకర్త పాత్ర కూడా పోషించారని అన్నారు.



లతీష్ ఎన్నడు గర్వం చూపించలేదు. పార్టీ గీసిన గీతను దాటలేదు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించిన వ్యక్తి, ప్రజలను సమీకరించడంలో, సమస్యల మీద స్పందించడంలో లతీఫ్ యొక్క పాత్ర చాలా ప్రముఖమైనది అని అన్నారు. సమాజంలో అందరూ గర్వించే స్థానంలో ఉన్నారు. ఈ సమాజంలో కార్పొరేటిజం, కన్స్యూమెరిజం రెండు డామినేట్ చేస్తున్నాయని అన్నారు. ప్రతీది వ్యాపారంతో చూసే ధోరణి పెరిగిందన్నారు.

# సీజేఐ గవాయ్ పై దాడి చేసిన లాయర్ ను కఠినంగా శిక్షించాలి

రాయపోల్ :అమృత్ తెలంగాణ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై లాయర్ రాకేష్ కిషోర్ న బార్ కౌన్సిలింగ్ శాశ్వతంగా సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిజెఐ గవాయ్ పై దాడి చేయడమంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ లౌకిక పునాదిని కూల్చివేసి, న్యాయవ్యవస్థను మతపరమైన ఆటబొమ్మగా మార్చడానికి ప్రయత్నించే శక్తులకు ఇది ఒక పరాకాష్ఠన్నారు. అత్యున్నత న్యాయస్థానంపై జరిగిన దాడి కేవలం ఒక సంఘటన కాదు, ఇది భారత రాజ్యాంగంపై మత వాదుల యుద్ధ ప్రకటన అన్నారు. న్యాయస్థానం దేవుడి కోట కాదు, న్యాయమూర్తి మత గురువు కాదు. లౌకిక పునాదిపై దాడి మన రాజ్యాంగం ప్రకారం, రాష్ట్రం ఏ మతానికీ అనుకూలంగా ఉండదు, వ్యతిరేకంగానూ ఉండదు. ఖజురాహో ఆలయ విగ్రహం పునరుద్ధరణ పిటిషన్‌ను సిజెఐ గవాయ్ కొట్టివేయడం ఈ లౌకిక సూత్రానికి నిదర్శనం. ఆ సమస్య ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా చట్ట పరిధిలోకి వస్తుందని చెప్పడం న్యాయపరమైన విధి. న్యాయమూర్తి చేసిన ఆ రాజ్యాంగబద్ధమైన వ్యాఖ్యను విష్ణుమూర్తిని అడగండని వక్రీకరించి ప్రచారం చేయడం జరిగింది. న్యాయమూర్తినే భయ పెట్టడం అంటే అది ప్రజాస్వామ్యానికి పతనమన్నారు. రాకేష్ కిషోర్ సిజెఐపై తన షూ తో దాడి చేసి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదు అంటూ వ్యాఖ్యలు చేయడు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో కుల మత జాతి వర్గ భేదం లేకుండా ప్రవర్తించాల్సింది పోయి సనాతన ధర్మం అంటూ మతపరమైన వ్యాఖ్యలు



ప్రస్తావించడం సిగ్గుచేటు అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే దేశంలో నివసిస్తున్న సామాన్య ప్రజల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలన్నారు. ఇలాంటి చర్యలు దేశానికి ప్రమాదకరమని ప్రపంచ దేశంలో భారతదేశం విలువ తగ్గించే విధంగా ఈ చర్యలు ఉన్నాయన్నారు. కాబట్టి ఈ దుర్ఘటనకు పాల్పడిన లాయర్ రాకేష్ కిషోర్ ను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# పోషకాహారం పట్ల అవగాహన కార్యక్రమం

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: అశ్వారావుపేట మండలం, గాండ్లగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డి గుంపు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం 'పోషణ మాసం' సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ రాములమ్మ మాట్లాడుతూ.. "పోషకాహారం అంటే కేవలం తిండి కాదు, ఆరోగ్యానికి మేలుచేసే ఆహారాన్ని సరియైన మోతాదులో, సరైన సమయంలో తీసుకోవడం" అని వివరించారు. కేంద్ర ప్రాంగణంలో చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో ఆకర్షణీయమైన ఆహార పదార్థాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. స్థానికంగా పండే జొన్న, రాగి, సజ్జ వంటి చిరుధాన్యాలు తో తయారుచేసిన వంటకాలు, పప్పు కూరలు, ఆకుకూర వంటకాలు ప్రదర్శనలో ఉంచి వాటి పోషక విలువలను వివరించారు. బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను సందర్శించారు. అందరికీ చిరుధాన్యాలు తో తయారైన పదార్థాలను



రుచి చూపించి వాటి ప్రయోజనాలను వివరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ "ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో ప్రజల్లో పోషణ పట్ల చైతన్యం పెంచుతాయి" అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు కోసం ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు కలిసి గృహ సందర్శనలో ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలకు తగిన ఆహారం, విశ్రాంతి, ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారు. కేంద్రంలో జరిగిన ప్రదర్శనలో పిల్లలతో పాటు మహిళలు కూడా పాల్గొన్నారు. తమ ఇళ్లలో పెరటి తోటలు ఏర్పాటు చేసి కూరగాయలను పెంచుకోవాలని నిర్ణయించారు. "ప్రతి ఇంట్లో ఒక పెరటి తోట ప్రతి కుటుంబంలో ఆరోగ్య వృద్ధి" అనే నినాదాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రాములమ్మ, ప్రమీల, బుల్లెమ్మ, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని పోషణ మాసం మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# పత్తి పంట ద్వారా రైతులకు జీవనాధారం

రాయపోల్ : అమృత్ తెలంగాణ: పత్తి పంట ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది రైతులకు జీవనాధారం ఇస్తుందని వ్యవసాయం నుంచి వస్త్ర పరిశ్రమ వరకు అనేక రంగాలలో ఉపాధి కల్పిస్తుందని పత్తి పంటను తెల్ల బంగారమని అంటారని భారత నవ నిర్మాణ సంస్థ కో ఆర్డినేటర్ దాతర్ పల్లి భాస్కర్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం రామారం గ్రామంలో ప్రపంచ పత్తి దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ పత్తి దినోత్సవం జరుపుకోవడం ద్వారా పత్తి పంట యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటామన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ 2019 లో మొదటిసారి ప్రపంచ పత్తి దినోత్సవం ప్రారంభించింది. ఈ దినోత్సవం ఉద్దేశ్యం పత్తి యొక్క ప్రాధాన్యతను



ప్రపంచానికి తెలియజేయడం, పత్తి రైతులను శక్తివంతం చేస్తు, పత్తి ఉత్పత్తిని సుస్థిరంగా అభివృద్ధి చేయడమన్నారు. భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద పత్తి ఉత్పత్తి దేశాల్లో ఒకటి. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా పత్తి పండించబడుతోందన్నారు. పత్తి పంట వలన మనకు వస్త్రాలు మాత్రమే కాకుండా, పత్తి విత్తన నూనె, పశువుల ఆహారం వంటి అనేక ఉత్పత్తులు కూడా లభిస్తున్నాయి. ముఖ్యంగా పత్తి సహజమైన, బయోడిగ్రేడబుల్ అయిన పంట కావడం వల్ల పర్యావరణానికి మేలు చేస్తుంది. ఈ కార్యక్రమంలో పియు మేనేజర్ కల్పన, ఫీల్డ్ ఫెసిలిటీర్స్, కరుణాకర్, శ్రీకాంత్, వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ ప్రసాదరావు

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: మందగించిన పాఠశాలల హాజరు శీర్షికన నవతెలంగాణ ల మంగళవారం ప్రచురించిన కథనానికి స్పందిస్తూ మండల విద్యాధికారి ప్రసాదరావు చర్యలు ప్రారంభించారు. మంగళవారం ఉదయం పట్టణంలోని ఎంపీపీ పాఠశాల నందమూరి నగర్ ను ఎంఈఓ స్వయంగా సందర్శించారు. ప్రార్థనా సమయానికే పాఠశాలకు చేరుకున్న ఆయన, విద్యార్థుల హాజరు స్థితిని పరిశీలించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పాఠశాలలో మొత్తం 22 మంది విద్యార్థులు ఉండగా, 17 మంది మాత్రమే హాజరయ్యారని ఆయన తెలిపారు. ఇది ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో ఒక్క ఉపాధ్యాయురాలు హాజరై బోధన కొనసాగించారని



పేర్కొన్నారు.

తదుపరి ఎంపీపీ ఎస్ బీసీ కాలనీ పాఠశాల ను కూడా తనిఖీ చేశారు. అక్కడ మొత్తం 60 మంది విద్యార్థుల్లో 44 మంది హాజరయ్యారని, నలుగురు ఉపాధ్యాయుల్లో ముగ్గురు హాజరై విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వ్యక్తిగతంగా పరిశీలించిన ఎంఈఓ, పాఠశాల రికార్డులు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలసి కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీఆర్పీ ప్రభాకరాచార్యులు ఆయన వెంట ఉన్నారు.

# బ్లాక్ లింగరీలో శర్మా గాళ్ దుమారం



నేహా శర్మ పరిచయం అవసరం లేదు. రామ్ చరణ్ చిరుత చిత్రంతో కథానాయికగా ఆరంగేట్రం చేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత తెలుగులో నటించలేదు. మొదటి సినిమాతోనే రామ్ చరణ్ తో ప్రేమలో పడిందని అందువల్ల తనకు తిరిగి ఇక్కడ అవకాశాలు రాలేదని కూడా అప్పట్లో ప్రచారమైంది. ఇటీవల తానాజీ లాంటి బ్లాక్ బస్టర్ లో నటించింది నేహాశర్మ. ఆ తర్వాత వరుసగా భారీ చిత్రాలకు కమిటైంది. అంతకుమించి వరుస ఫోటోషూట్లతో అభిమానులను కట్టి పడేస్తోంది. తాజాగా నేహాశర్మ ఇన్నర్ అందాల కవ్వింపు హాట్ టాపిక్ గా మారింది. బ్లాక్ బాడీకాన్ కటౌట్ డ్రెస్ లో నడుము అందాలను ప్రదర్శిస్తుంటే యూత్ గుండెల్లో గుబులు రేగుతోంది. నేహా టూ హాట్ గా కనిపిస్తోంది. క్రూక్- క్యా సూపర్ కూల్ హై హమ్- యమ్లా పగ్లా దీవానా 2- తాన్హాజీ సహా మరిన్ని హిందీ చిత్రాలలో నటించిన అందాల సుందరి నేహా శర్మ కు హాటెస్ట్ గాళ్ గా ఉన్న గుర్తింపు పెద్ద ప్లస్. ఈ గుర్తింపే అవకాశాలు తెస్తోంది. 34 ఏళ్ల ఈ బ్యూటీ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. దాదాపు 14.8 మిలియన్ల మంది అనుచరులకు నిరంతర ఫోటోషూట్లతో ట్రీటిస్తోంది. టూపీస్ దుస్తులతో దుమారం రేపడం.. మినీ టాప్ లు.. బాడీ-హగ్గింగ్ స్కర్ట్ లతో ఊరించడం.. బికినీలతో హీటెక్కించడం నేహాకు కొత్తేమీ కాదు. అందమైన నెక్ లైన్ పుష్కలమైన స్కర్ట్ లో టోన్డ్ మిడ్ రిఫ్ ను ఆవిష్కరిస్తుంది.

శర్మ సిస్టర్స్ సందడే వేరు!

శర్మ సిస్టర్స్ ని విడి విడిగా చూడడం చాలా అరుదు. జిమ్ కి వెళ్లినా .. పబ్ కి వెళ్లినా .. మార్కెట్ కి వెళ్లినా లేదా ఇంట్లో సరదాగా సమయాన్ని గడిపినా.. ఒకరితో ఒకరు కలిసి ఎంతో ఫన్ ని క్రియేట్ చేస్తుంటారు. తన సోదరి నేహాశర్మతో కలిసి ఐషా శర్మ నిరంతర ఫోటోషూట్ల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. నేహా ఫిట్నెస్ ఫ్రీక్. నిరంతరం తన సోదరితో జిమ్ కి వెళుతుంది. అభిమానులందరినీ ప్రేరేపిస్తుంది. ఓవైపు సినిమాల్లో వెబ్ సిరీస్ లలో నటిస్తూనే సిస్టర్స్ ఓటీటీలోనూ ప్రయోగాలు చేస్తున్నారు.

# నడుము నాభి అందాలు చూపిస్తూ రెచ్చగొడుతోంది


బాలకృష్ణ రూలర్ సినిమాతో పాటు పలు తెలుగు మరియు ఇతర భాష చిత్రాల్లో నటించిన ముద్దుగుమ్మ వేదిక ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇలా సందడి చేస్తోంది. సినిమాల్లో ఆఫర్స్ తక్కువ వస్తున్న కూడా సోషల్ మీడియా ద్వారా ఈ ముద్దుగుమ్మ తన అందాల ఆరబోతతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలా నడుము నాభి అందాలని చూపిస్తూ కుర్రకారుకు మతి పోగొట్టే విధంగా ముద్దుగుమ్మ వేదిక ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు ఒకటి రెండు సినిమాల్లో నటిస్తున్నప్పటికీ వాటి వల్ల ఎంత వరకు ప్రయోజనం ఉంటుందో అనేది క్లారిటీ లేదు. అయినా కూడా సోషల్ మీడియాలో మాత్రం ఈమె రెగ్యులర్ గా నాభి నడుము అందాలను చూపించడంతో కుర్రకారు మతి పోగొడుతోంది. అందమైన వేదిక ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయినా ఇప్పటికి కూడా కొత్త హీరోయిన్ మాదిరిగా నాజూకు అందాలతో నడుము అందాలతో కుర్ర కారు మతి పోగొట్టుతుంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాలీవుడ్ యంగ్ హీరోలు కాస్త ఈమె వైపు చూస్తే బాగుంటుందని.. తప్పకుండా యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా ఈమె మారే అవకాశం ఉంటుంది అంటూ నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. బాలకృష్ణ తో సినిమా చేసిన తర్వాత తెలుగులో కొన్ని ఆఫర్స్ వచ్చినా కూడా సున్నితంగా తిరస్కరించిందట ఈ అమ్మడు స్టార్ హీరోలకు జోడిగా నటించేందుకు ఆశపడుతోంది. ఇలాంటి అందాల



ఆరబోత చేస్తే ఇప్పుడు కాకుండా మరి కొన్నాళ్లకైనా తప్పకుండా యంగ్ స్టార్ హీరోలకు ఈమె వాంటెడ్ హీరోయిన్ గా నిలుస్తుందేమో చూడాలి.

# ఎంతకాలానికి పెళ్లి.. పిల్లల గురించి క్లారిటీగా మాట్లాడింది

గ్లామర్ ప్రపంచంలో హీరోయిన్ల ఆయుష్షు చాలా తక్కువగా చెబుతుంటారు. అయితే.. అలాంటి లెక్కల్ని తప్పుగా తేల్చేసిన బ్యూటీలు ఈ మధ్యన ఎక్కువ అవుతున్నారు. ఇండస్ట్రీకి వచ్చి.. ఒక వెలుగు వెలిగి.. అంతలోనే కనిపించకుండాపోయిన భామలకు భిన్నంగా ఏళ్లకు ఏళ్లు కంటిన్యూ అవుతున్న వారిలో మిల్కీ బ్యూటీ తమన్నా ఒకరు. అప్పుడు ఇప్పుడు మిల్కీ బ్యూటీ అన్నంతనే గుర్తుకు వచ్చే తమన్నా భాటియా.. పదమూడేళ్ల చిరు ప్రాయం నుంచే సినిమాల్లో నటిస్తోంది. ఇప్పుడు ఆమె వయసు 32 ఏళ్లపైనే. గ్లామర్ ప్రపంచంలో ఇంతకాలం కంటిన్యూ అవుతున్న అతి కొద్ది బ్యూటీల్లో తమన్నా ఒకరు. మిగిలిన హీరోయిన్ల మాదిరి గాసిప్స్ తన మీద రాకుండా ఆమె జాగ్రత్తలు తీసుకుంటుందని చెబుతారు. థర్టీకి దగ్గరకు వచ్చేసరికి హీరోయిన్లు పెళ్లిళ్లు చేసుకొని.. కాస్తంత గ్యాప్ ఇచ్చి




సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేయటం ఈ మధ్యన చూస్తున్నాం. కానీ.. తమన్నా మాత్రం పెళ్లి ముచ్చటే తీసుకురాదు. అలాంటి ఆమె తాజాగా తన తీరుకు భిన్నమైన మాటల్ని చెప్పుకొచ్చింది. తాను పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పింది. పెళ్లికి సంబంధించిన ప్రస్తావనతో ఆపని ఆమె.. పిల్లల్ని కనాలనికూడా అనుకుంటున్నట్లు చెప్పి ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే.. పెళ్లి.. పిల్లల విషయాల్ని మాట్లాడేందుకు మక్కువ చూపని ఆమె.. ఇప్పుడు అందుకు భిన్నంగా ఒక్కసారిగా పెళ్లి.. పిల్లల్ని కనే విషయాన్ని తేల్చి చెప్పిన వైనం చూస్తే.. పెళ్లికి సంబంధించిన శుభవార్త త్వరలో షేర్ చేసుకోనుందా? అన్న సందేహం కలుగక మానదు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఫ్రీజర్ లోంచి బయటపడి బతికిపోయింది....!



కోల్డ్ స్టోరేజ్ గొడౌన్ (ఫ్రీజర్) లో లాక్ అయిపోయిన ఒక అందమైన అమ్మాయి బతుకు పోరాటం నేపథ్యంలో 'మిలీ' అనే ఇంట్రెస్టింగ్ సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. నిజఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. చలికి గడ్డకట్టిపోయే సన్నివేశంలో జాన్వీ కపూర్ ఎలాంటి పోరాటం సాగిస్తోందో ఇంతకుముందే ట్రైలర్ లో వీక్షించాం. గగుర్పొడిచే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో మిలీ ట్రైలర్ ఆద్యంతం రక్తి కట్టించింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com